ఐటెం 3

27.05.2020

అమరావతి

- సీఎంక్యాంప్ కార్యాలయంలో 'మన పాలన–మీ సూచన' కార్యక్రమం.
- మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా'విద్యా రంగం'పై మేధో మథనం.
- విద్యార్థులు, నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖి:›
- విద్యా సంస్థల పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్‌సైట్
- వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన సీఎం శ్రీ వైయస్ జగన్
- వసతులు, తాము పాటిస్తున్న ప్రమాణాలపై స్కూళ్లు, కాలేజీల వివరాలు అప్‌లోడ్ చేయాలి
- ఆ డొమెయిన్ అందరికీ అందుబాటులో ఉంటుంది
- పరిశీలనచేసి... ఆ వసతులు లేకపోతే ఫిర్యాదుచేయవచ్చు
- స్కూళ్లు, కాలేజీలు తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

అమరావతి:విద్యా సంస్థల మానిటరింగ్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటైంది. ఆ సైట్‌ను సీఎం శ్రీ వైయస్ జగన్ బుధవారం ఆవిష్కరించారు. తమ దగ్గరున్న వసతులు, తాము పాటిస్తున్న ప్రమాణాలపై స్కూళ్లు, కాలేజీలు స్వయంగా ఆ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తాయని, ఆ డొమెయిన్ అందరికీ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. స్కూళ్లు, కాలేజీలు వెబ్‌సైట్‌లో ప్రకటించినవి నిజంగా లేకపోతే, విజిల్ బ్లోయర్స్ ఎవరైనా స్పందించి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. విద్యా రంగంలో కార్పొరేట్ సంస్కృతికి చెక్ పెడుతున్నామన్న సీఎం, అందు కోసం రెండు కమిషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'మన పాలన–మీ సూచన' కార్యక్రమం మూడవ రోజున 'విద్యా రంగం'పై మేధో మథనం జరిగింది. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖిలో పాల్గొన్నారు.

మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎస్ నీలం సాహ్ని, విద్యా శాఖకు చెందిన అధికారులతో పాటు, నిపుణులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్కృతి పోవాలి:

విద్యా రంగంలో చాలా మార్పులు తీసుకువస్తాయని నమ్ముతున్నామన్న సీఎం శ్రీ వైయస్ జగన్, ఈ వ్యవస్థలో కార్పొరేట్ సంస్కృతి పోవాలని చెప్పి, ఇద్దరు హైకోర్టు జడ్జీలు జస్టిస్ ఆర్.కాంతారావు, జస్టిస్ ఈశ్వరయ్యకు బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. ఒకరు పాఠశాల విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్‌కు, మరొకరు ఉన్నత విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్‌కు బాధ్యత వహిస్తారని చెప్పారు. ఇప్పటికే ఆ కమిషన్లు పనులు మొదలు పెట్టాయని తెలిపారు.

జస్టిస్ ఆర్.కాంతారావు కమిషన్ గత ఫిబ్రవరిలో 172 స్కూళ్లు తనిఖీ చేసి 62 స్కూళ్లకు నోటీసులు జారీ చేయగా, జస్టిస్ ఈశ్వరయ్య కమిషన్ 130 కాలేజీలు తనిఖీ చేసి 40 కాలే లపై చర్య తీసుకున్నారని చెప్పారు.

## ప్రత్యేక వెబ్‌సైట్:

విద్యా సంస్థల మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను కార్యక్రమంలో సీఎం ఆవిష్కరించారు. ఇప్పుడు ఉన్న వసతులు, పాటిస్తున్న ప్రమాణాలపై ఆయా స్కూళ్లు, కాలేజీలు తమకు తాముగా అప్‌లోడ్ చేసుకునేలా ఆ వెబ్‌సైట్ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి స్కూల్, కళాశాల వారికున్న సదుపాయాలు, మా ప్రమాణాలు ఇవి అని చెప్పి ఆ వెబ్‌సైట్‌లో పెడతాయని, ఒకసారి పెట్టిన తర్వాత అవి నిజంగా లేకపోతే, ఎవరైనా సరే విజిల్‌బ్లో చేయవచ్చని, అవి నేరుగా ఈ కమిషన్ల దగ్గరకు వస్తాయని, అప్పుడు వారు చర్య తీసుకుంటారని పేర్కొన్న సీఎం, గొప్ప కార్యక్రమంగా ఈ లాంఛింగ్ అని అభివర్ణించారు. ఈవెబ్‌సైట్ అందరికీ అందుబాటులో ఉంటుందని సీఎం చెప్పారు.